తాగారు.. ఊదారు

- గ్రేటర్‌లో డీడీ పరీక్షల్లో చిక్కిన 3 వేల మంది
- కౌన్సెలింగ్ కోసం పరుగులు తీసిన మందు బాబులు
- మద్యం మత్తులో టక్కరిచ్చిన కానిస్టేబుల్.. ఒకరి మృతి
- చల్లని బిర్యానీ.. ఉడకని ముక్కలంటూ అబిడ్స్‌లో ఘర్షణ

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): కొత్త సంవత్సరం వేడుకల్లో భారీగా మందు బాబులు పట్టుబడ్డారు. సైబరాబాద్‌లో ఓ కానిస్టేబుల్ మద్యం మత్తులో బైక్ నడిపి.. ఒక వ్యక్తి మరణానికి కారకుడయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బిర్యానీలో ముక్కలు రాలేదని, చల్లగా ఉందంటూ ప్రశ్నించిన పాపానికి హోటల్‌లో పనిచేసే సిబ్బంది, యాజమాన్యం కలిసి కస్టమర్లను చితకబాదారు. వీటితో పాటు ట్రై కమిషనరేట్ల పరిధిలో అక్కడక్కడ చిన్న చిన్న గొడవలు, ప్రమాదాలు మినహా న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా భారీ ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ (డీడీ పరీక్షలు) నిర్వహిస్తామంటూ మూడు రోజుల ముందు నుంచే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రై పోలీస్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు హెచ్చరిస్తూ వచ్చారు. అయినా.. మందుబాబులు న్యూ ఇయర్ వేడుకల్లో మందులో మునిగి, తేలారు. చివరకు అడ్డంగా పోలీసులకు దొరికిపోయారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో దాదాపు 3 వేలకు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని గోషామహల్ ట్రాఫిక్ శిక్షణా కేంద్రానికి కౌన్సెలింగ్‌కు తరలివెళ్లడంతో అక్కడ మందు బాబులతో రద్దీ ఏర్పడింది.

అడుగడుగునా డీడీ పరీక్షలు..

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టడి చేసేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కూకట్‌పల్లిలో ఎస్ఆర్‌నగర్ ఠాణాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లికార్జున్ మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ కేఎల్ఎం దుస్తుల షాపులో పనిచేసే దుర్గయ్య(58)ను ఢీకొట్టడంతో మృతి చెందాడు. స్థానికులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ధూల్‌పేటకు చెందిన సుమిత్‌సింగ్ మరో ఏడుగురితో కలిసి అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్‌లో భోజనం చేసేందుకు రాత్రి వెళ్లారు. వివిధ వంటకాలను ఆర్డర్ చేశారు. వెయిటర్ రోటీలు, బిర్యానీ తీసుకొచ్చాడు. మటన్ బిర్యానీ చల్లగా ఉన్నదని, సరిగ్గా ఉడకలేదంటూ వెయిటర్‌ను అడిగారు. వెయిటర్ దానిని వేడి చేసి తిరిగి తెచ్చాడు. బిర్యానీ సరిగ్గా లేదంటూ.. మేము బిల్లు చెల్లించమంటూ ధూల్‌పేట వాసులు చెప్పారు. కౌంటర్ వద్దకు వచ్చిన తరువాత కూడా మటన్ బిర్యానీ బిల్లుపై వాగ్వాదం జరిగింది. ఈ గొడవతో ఒకరిపై ఒకరు చేయి చేసుకునే పరిస్థితికి వచ్చింది. దీంతో హోటల్లో పనిచేసే సర్వర్లు, ఇతర పనివాళ్లు ధూల్‌పేట వాసులపై దాడికి దిగి చికతబాదారు. హోటల్ యజమానితో పాటు దాడికి పాల్పడిన వారిపై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి, 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై స్థానిక గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించి.. హోటల్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారి సంఖ్య

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిలో 20 నుంచి 30 ఏండ్ల మధ్య ఉన్న వారు 1,400 మందికి పైగానే ఉన్నారు. సైబరాబాద్‌లో 18 మందికి బీఏసీ కౌంట్ 500 ఎంజీపైగానే వచ్చిందని పోలీసులు వెల్లడించారు.

కమిషనరేట్ల వారీగా మద్యం మత్తులో పట్టుబడిన వారి వివరాలు

పోలీసు కమిషనరేట్	నమోదైన కేసులు	మహిళలు	పురుషులు
హైదరాబాద్	1243	02	1239
సైబరాబాద్	1241	02	1239
రాచకొండ	517	0	517

నలుగురు మానసిక వికలాంగులకు ఆశ్రయం

గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన సిటీ పోలీస్

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహిళా సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం గుజరాత్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థలో ఉన్న నలుగురు మానసిక వికలాంగులను కాపాడి హైదరాబాద్‌కు తరలించారని డీసీపీ కవిత తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో నిరాశ్రయులైన వారికి చేయూతనిచ్చేందుకు ఒక బృందం గుజరాత్‌కు వెళ్లిందని, అక్కడ కుచర్ భుజ్‌ని మానవ్ జ్యోతి ఆశ్రమం ప్రతినిధులు కాపాడిన తెలంగాణకు చెందిన అశ్రయ (55), ఏపీకి చెందిన గోపు అలియాస్ లక్ష్మి(48), స్వీటీ(41), నుర(45)ను హైదరాబాద్‌కు తీసుకొచ్చారన్నారు. వారిని సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. వారి బాధ్యతను ఆ సంస్థ చూసుకోవడానికి ముందుకొచ్చిందని తెలిపారు. ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలోని బృందం గుజరాత్‌కు వెళ్లిందని డీసీపీ తెలిపారు.

ఏసీపీ సయ్యద్ నయీముద్దీన్ జావీద్‌కు ఉత్తమ సేవా పతకం

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న రాష్ట్ర పోలీసులకు సేవా పతకాలు ప్రకటించింది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్ సేఫ్టీ విభాగంలో ఏసీపీగా సేవలందిస్తున్న సయ్యద్ నయీముద్దీన్ జావీద్‌కు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్‌బాబు ఆయనను అభినందించి, ఘనంగా సన్మానించారు.

–జూబ్లీహిల్స్,జనవరి1

ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ)లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు జి.ఆదిశేషగిరి రావు, ఉపాధ్యక్షుడు తుమ్మల రంగారావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

పోలీస్ ఉత్తమ సేవలకు పతకాలు..

జూబ్లీహిల్స్: కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న రాష్ట్ర పోలీసు ఉద్యోగులకు సేవా పతకాలు ప్రకటించింది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ ఏఎస్ఐ మంద నవీన్, ఉప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ వేలేటి మనోహర్‌కు.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ సీసీఎస్.. టీమ్ ఏఎస్ఐ ఎం.షుద్రక్ అలియాస్ నాగరాజుకు.. సైబరాబాద్ కమిషనరేట్ నుంచి సీటీసీ ఏఎస్ఐ గజాడి మల్లేశ్‌కు మహోన్నత సేవా పతకం లభించింది. వీరితో పాటు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏసీపీ సయ్యద్ నయీముద్దీన్ జావీద్, ఎస్ఐ కొంతం సత్యనారాయణ, ఎస్‌బీ ఏఎస్ఐ జూకంటి రామకృష్ణ, ఏఆర్ ఎస్ఐ చింతపల్లి సిద్దప్ప, చౌటుప్పల్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కాకి వెంకట రమణారెడ్డి, టీటీఐ హెడ్ కానిస్టేబుల్ పి.దశరథ్ గౌడ్‌కు పతకాలు లభించాయి. అలాగే, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ అలీం, నార్కోటిక్స్ ఏఎస్ఐ మహ్మద్ చాంద్ పాషా, చాంద్రాయణగుట్ట ఏఎస్ఐ ఎంబీకే.శ్రీనివాస రావు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ సలీం ఖాన్, హెడ్ క్వార్టర్స్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ సర్దార్ అహ్మద్, ఏఆర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌కు.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మాదాపూర్ ట్రాఫిక్ అసిస్టెంట్ సీపీ జి.రణ్‌వీర్‌రెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ అసిస్టెంట్ సీపీ శ్రీనివాసులు, హెడ్ క్వార్టర్స్ ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, మోషి, హెడ్ క్వార్టర్స్ హెడ్ కానిస్టేబుల్ హరిరంగ, సీఎస్‌డబ్ల్యూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జయకుమార్‌లకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. అలాగే యూసుఫ్‌గూడ ఫస్ట్ పోలీస్ బెటాలియన్‌లో 5 గురికి, కొండాపూర్ 8వ బెటాలియన్‌లో 5 గురికి, ఇంటెలిజెన్స్‌లో 13 మందికి, సీఐడీలో 5 గురికి, జీఆర్‌పీ సికింద్రాబాద్, గ్రేహౌండ్స్, టెక్నికల్, ప్రెస్ వ్యవహారాల్లో ఒకరికి చొప్పున, ఆక్టోపస్, ట్రాన్స్‌పోర్ట్‌లలో ఇద్దరికి చొప్పున ఉత్తమ సేవా పతకాలు లభించాయి. వీరితో పాటు కఠిన సేవా పతకాల్లో ఇంటెలిజెన్స్ విభాగంలో 6 గురికి, గ్రే హౌండ్స్‌లో 18 మందికి.. రాచకొండ పరిధిలో 32 మందికి సేవా పతకాలు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 30 మందికి, సైబరాబాద్ పరిధిలో 54 మందికి సేవా పతకాలు లభించాయి.

దేశానికి లీడర్‌గా తెలంగాణ పోలీస్

ఐపీఎస్ ఆఫీసర్ల న్యూ ఇయర్ వేడుకల్లో డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్ ఎప్పటికీ దేశానికి లీడర్‌గానే ఉంటుందని, ఇప్పటికే మనకు 'బెస్ట్ పోలీసింగ్'గా జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్నదని, ఆ పేరు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని డీజీపీ రవిగుప్తా తెలిపారు. తెలంగాణ పోలీస్ పతాకాన్ని అదే స్థాయిలో ఎగురవేసేందుకు అంతా కలిసికట్టుగా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో ఐపీఎస్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు డీజీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడీజీలు శివధర్‌రెడ్డి, అనిల్‌కుమార్, మహేశ్ భగవత్, శిఖాగోయెల్, విజయ్‌కుమార్, సంజయ్‌కుమార్ జైన్, అభిలాష బిస్ట్, సౌమ్యామిశ్రా, సందీప్‌శాండిల్య, సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, ఐజీలు తరుణ్‌జోషి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.రమేశ్, ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఏసీబీ డైరెక్టర్ ఏఆర్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో సీపీ కొత్తకోట

చార్మినార్ వద్ద కుటుంబసభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఈ వేడుకల్లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ట్యాంక్‌బండ్, చార్మినార్, కోఠి, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, కేబీఆర్ పార్కు తదితర ప్రాంతాల్లో జరిగిన వేడకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజల భద్రతకు భరోసా ఇస్తూ బేసిక్ పోలీసింగ్ అందించేందుకు ఎల్లవేళల్లో కృషి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగర అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీలు రంగనాథ్, సత్యనారాయణ, డీసీపీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటీరియర్ డిజైనర్ మృతి

మాదాపూర్, జనవరి 1 : రోడ్డు ప్రమాదంలో ఇంటీరియర్ డిజైనర్ మృతి చెందాడు. మాదాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి– కొత్తగూడెంకు చెందిన చంద్రు రాజేందర్ (38) మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో ఇంటీరియర్ డిజైనర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మాదాపూర్ పిల్లర్ నంబర్ 1728 వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేపీహెచ్‌బీలో యువకుడి..

అరుణ్ (ఫైల్)

బాలానగర్, జనవరి 1 : కొత్త సంవత్సరం వచ్చిన వేళ కేపీహెచ్‌బీకాలనీ పీఎస్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ మల్యాల గ్రామానికి చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (23) బతుకుదెరువు కోసం వచ్చి.. మోతీనగర్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా కేపీహెచ్‌బీకాలనీ మిత్రహిల్స్ నుంచి హైదర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన స్కోడా ర్యాపిడో కారు ముందు వెళ్తున్న అరుణ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టి.. అదే వేగంతో డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. తీవ్రంగా గాయపడిన అరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ దినేశ్ మద్యం మత్తులో ఉండి.. నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.